

# సాంగత్యం

కథ

**బెజ్జారపు వినోద్‌కుమార్**

**ఈ రోజు సాయంత్రం మొదలైందా వాసన.**

**ఇంటర్‌నెట్ ముందర కూచుని వివిధ దేశాలలో ఉన్న స్నేహితులతో చాటింగ్ చేయడం అలవాటు. అదే సమయంలో అంది హరిణి.**

'ఏమండీ మీకు ఉత్తరం'

ఆశ్చర్యపోయాను. ఈ కాలంలో ఉత్తరాలేంటి? ప్రపంచంలో ఎక్కడున్నా అత్యాధునిక ప్రసార మధ్యమాల ద్వారా ఎంతో దగ్గిరైపోయిన ఈ యుగంలో ఉత్తరాలేంటి? ఉత్తరం రాసి దాని ని పోస్టులో వేసి అది అటు తిరిగి ఇటు తిరిగి రెండు మూడు గట్టి దెబ్బలు తిని నాలుగురోజులకు ఇంటికి చేరేసరికి విషయాలన్నీ పాచిపట్టిపోవూ?

ఇంటర్‌నెట్‌లో ఇక్కడ మీట నొక్కితే అక్కడ తటాలున అక్షరం రాలి పడాలి. అక్కడ ఫోన్‌లో నెంబర్ నొక్కిన మరుక్షణం జేబులో ఉన్న సెల్‌ఫోన్ వైబ్రేషన్స్‌తో చర్మం అదిరిపోవాలి.

అంతేగానీ ఈ ఉత్తరాలేంటి?

నాలుగురోజుల కిందటి విషయాల కోసం ఇప్పుడీ ఉత్తరాన్ని చింపాలి. చదువుతున్నంత సేపూ వేరేపని చేయకూడదు. ఎంత టైం వేస్టు?

"నేనా ఇంకా నయం..." అనేసి ఉత్తరం టేబుల్‌పై పడేసి వెళ్ళిపోయింది.

ఆమె కూడా బిజీ.

పిల్లల కోసం చూసాను. ఒకరు హోంవర్క్‌లో ఒకరు టివి ముందర బయట ప్రపంచాన్ని మర్చిపోయి ఉన్నారు. ఇద్దరు పిల్లలకూ ఇంత చిన్నప్పుడే వచ్చిన కళ్ళద్దాలలోంచి ఎన్ని అనుభూతులు ఫిల్టరవుతున్నాయో?...ఎన్ని స్పందనలు మేటలు కట్టుకుపోయాయో? వాటర్ ఫిల్టర్‌లోంచి రాలిపడుతున్న రుచిలేని నీటి చుక్కలా వారి విజన్ ఎంత సోఫిస్టికేటెడ్‌గా అయిపోతోందో...?

"మీ వాడి రాంక్ ఈసారి తగ్గింది బివేర్?" స్కూల్ ప్రిన్సిపాల్ అల్టిమేటం.

పిల్లల షెడ్యూల్‌లో మరో ట్యూషన్ చేరుతుంది.

"మీ పిలగాడు రత్నమయ్యా... ఏది చెప్పినా ఇట్టే అర్థం చేసుకుంటాడు' అనేవాడు పెద్ద సార్ మా నాన్నతో.

నాన్న మీసాల మాటున చిరునవ్వు మెరిసేది.

కాని ఎలా సాధ్యమయ్యింది? సాయంత్రం బడి వదిలాకైనా, సెలవురోజైనా ఏనాడూ పుస్త కాలు ముందరేసుకుని కూచున్న పాపాన పోలేదు. అయినా చదువులో రత్నాన్నెలా అయ్యాను?

ఇంక లాభం లేదనుకుని ఉత్తరం వైపు చూసాను. ఇంటి నుండి, అమ్మ దగ్గర్నించి వచ్చిందా ఉత్తరం.

ఉత్తరం చించి చదివే ఓపికలేక ఇంటర్నెట్ చాటింగ్‌లో మునిగిపోయాను.

చాటింగ్ చేస్తున్న మిత్రులంతా వేరువేరు దేశాలలో ఉన్నా మేమంతా కలిసి చిన్నప్పుడు జారిపోతున్న చెడ్డీలను పట్టించుకోకుండా చెట్లెంబట, పుట్టలెంబట తిరిగిన వాళ్ళమే.

తిరిగి చాటింగ్ మొదలుపెట్టినప్పటి నుండి మొదలయ్యిందా వాసన. ప్లాస్టిక్ వాసన. వెగటు వెగటుగా. ముందుగా నాకర్థంకాలేదు. ఆ వాసన ఎక్కడి నుండి వస్తుందో. అంతకంతకు వాసన ఎక్కువ కావడంతో గమనించాను. కంప్యూటర్ మానిటర్‌లోంచి వస్తోందా వాసన.

కంప్యూటర్ షట్‌డౌన్ చేసాను.

టేబుల్‌పైన ఉత్తరం కనిపించింది. కొండమీద వాలిన గోగుపూల గుంపులా, మోటబావిలోకి తొంగిచూస్తున్న మామిడిపిందెలా ఉన్న ఉత్తరాన్ని చూడగానే ఏదోలా అనిపించింది. ఆలోచనలు వక్రీభవనం చెందాయి.

మేము ఊడలు పట్టుకుని ఊయలలూగిన మర్రిచెట్టు, కోతికొమ్మ ఆట ఆడిన మోదుగు చెట్టు, బాగ్దాద్ గజదొంగల్లాగా దొంగతనంగా వెళ్ళి పళ్ళు తెంపిన జామచెట్టు అన్నీ మరుగుజ్జులైపోయి బోన్‌సాయ్ మొక్కల్లా వాకిట్లో పడి ఉన్నాయి.

క్రికెట్ ముందర గిల్లీదండా, జావలిన్‌త్రో ముందర సలాక దిగేసే ఆట, అథ్లెటిక్స్ ముందు ముట్టిచ్చుకునే ఆట, లాంగ్‌జంప్ ముందు చార్‌పల్లి, వాలీబాల్ ముందు దెబ్బల చెండీ ఆట, చెస్ ముందు పచ్చీసాట, అష్టాచెమ్మాట, కార్‌రేసింగ్ ముందు తాటికమ్మల గిరకల పోటీ ఆట... చిన్నప్పుడు మేమాడుకున్న ఆటలన్నీ ఇన్‌ఫీరియారిటీతో మనసు మూలలో ఓ చోట ముడుచుకుపోయి ఉన్నాయి.

మళ్ళీ మొదలయ్యిందా వాసన. వెగటు పుట్టించే ప్లాస్టిక్ వాసన. ప్లాస్టిక్ బాటిల్‌లో నెలల తరబడి ఉంచిన నీళ్ళలోంచి వచ్చే ప్లాస్టిక్ వాసన.

కంప్యూటర్ కేసి చూసాను. ఆఫ్‌చేసి ఉంది. ఇల్లంతా వెతికాను. ఎక్కడా ఏమీ కనిపించ లేదు. వాసన అంతకంతకూ ఎక్కువైపోయి పొగలా గది అంతా ఆవరిస్తున్నట్లనిపించింది. ఉక్కిరిబిక్కిరవుతున్నట్లనిపించింది. వెగటు వాసనకు కడుపులో దేవినట్లుగా అనిపించి తలలో పాము నాలుకలాగా నొప్పి మొదయ్యింది.

అసంకల్పితంగా వెళ్ళి ఉత్తరం చేతిలోకి తీసుకున్నాను.

అమ్మతనం గుప్పుమంది.

** ** **

మట్టిలోంచి మొలకెత్తిన మహావృక్షం అమ్మ. ప్రాణమున్న పదార్థం ఎదుగుతున్న కొద్దీ దానితో అనుబంధమూ పెరుగుతూ పోతుంది. కాని ప్రాణం లేని వస్తువుపైన అదే స్థాయిలో విముఖతా ఏర్పడుతుంది. కారు, టి.వి., కంప్యూటరూ అన్నీ కాలం గడుస్తూన్నకొద్దీ పనికి రానివైపోతాయి. వస్తువు మార్చాల్సిందే. లేకపోతే విముఖతతో నిరంతర సాంగత్యం ఎవరు కోరుకుంటారు?

పొద్దున అమ్మ ఆలస్యంగా నిద్రలేవడం ఏనాడూ చూడలేదు.

కళ్ళు నులుముకుంటూ నిద్రలేచేసరికి వాకి

ట్లో ముగ్గులు వేస్తూ కనిపించేది. చేతులకు పుట్టమన్ను, కాళ్ళకు అలుకు చల్లినట్లుగా పెండ ముద్దలుముద్దలుగా అంటుకుని ఉండేది.

బొగ్గుతో పళ్ళు తోముకునేసరికల్లా గిన్నెలో చాయ్‌గ్లాసులోకి వడపోసి చేతికిచ్చేది. అప్పుడు తూరుపు సూరీడింకా మేలుకునేవాడు కాదు.

గ్లాసెడు చాయ్ తాగితేగానీ ఉదయం ఉదయంలా ఉండేది కాదు. కాని ఇప్పుడు అర కప్పు చాయ్ తాగగానే కడుపులో మంట. ఒమెప్రాజోల్ కాప్సుల్ కడుపులో పడాలి. ఓమెప్రాజోల్ గ్రాన్యూల్స్ కడుపులోకి వెళ్ళి ఆసిడ్‌ని న్యూట్రలైజ్ చేయాలి. లేకపోతే కడుపు మండిపోదూ? పెన్సిలిన్, ఆంపిసిలిన్, అమాక్సిసిలిన్, సెఫెలాక్సిన్, సెఫెడ్రాక్సిల్, నియోమైసిన్, జెంటామైసిన్, ఎరిత్రోమైసిన్, రాక్సిత్రోమైసిన్, అజిత్రోమైసిన్, నార్‌ఫ్లాక్సాసిన్, సిప్రోఫ్లాక్సాసిన్, గాటిఫ్లాక్సాసిన్, టెట్రాసైక్లిన్, డాక్సిసైక్లిన్, పారసెటమాల్, నిమ్సులైడ్, ఐబూప్రోఫెన్, డైక్లోఫెనాక్ సోడియం... అన్నానికి అంచుకు మామిడికాయ సోగికి బదులు మందులుండాల్సిందే.

హైపోగ్లైసీమియా... జీవితంలోని మాధుర్యం లుప్తమైనప్పుడు మనసులో మొదలయ్యే వణుకు... ఇవాళే మొదటిసారి ఫీలయ్యాను.

కట్టెల పొయ్యిమీద కొప్పెరలోంచి వేడినీళ్ళు తోడి తలస్నానం చేయించేది అమ్మ. అల్యూమినియం సందుకులో పుస్తకాలు సర్ది బడికి పంపించేది.

చలికాలంలో రెండు చెద్దర్లు కలిపి కప్పినా రాని వెచ్చదనం అమ్మ కడుపుని కరుచుకుని అమ్మ నడుంపైన కాలువేసి పడుకుంటే వచ్చేది. చలిలో బయటకు వెళ్ళేటప్పుడు పాతచీరను చింపి చెవులమీదుగా సంకటి కట్టేది. ఉదయం పూట చలికి వణుకుతూ లేస్తే కట్టెల పొయ్యిముందర పీటవేసి చలికాచుకోమనేది. అమ్మకు నేనేంటో అణువణువూ తెలుసు. అందుకే అమ్మ ప్రేమ నాకనుగుణంగా రూపాంతరం చెందుతూ ఉండేది. చలికాలంలో వెచ్చదనాన్ని, వేసవికాలంలో చల్లదనాన్ని అడగకుండానే అందించేది.

బాగా గుర్తు నాకు. ఓరోజు బడి వదిలే సమయానికి విపరీతమైన వాన. బడిలోనే ఆగిపోదామంటే అమ్మను చూడాలన్న కోరిక. వానలోనే బయలుదేరితే దారిలో నాకోసం వస్తూ అమ్మ. తన ఒంటిపై ఉన్న వరకు కాగితంలోకి నన్ను లాక్కుని ఇంటికి తీసుకెళ్ళి తడిబట్టలు విప్పి ఒళ్ళంతా తుడిచి పొడిబట్టలు వేసినప్పటి వెచ్చదనం... మొన్నటివరకు చినుకుపడితే అమ్మే గుర్తొచ్చేది. ఇప్పుడు వానపడితే దెబ్బతినిపోయే గిరాకి గుర్తొస్తుంది.

అమ్మ పని చేయకుండా నేనెప్పుడూ చూడలేదు. నాన్న పనుల్లోనో నా పనుల్లోనో, ఇంటి పనుల్లోనో, బీడీలు చేయడంలోనో ఏదో ఒక పనిలోనే ఆమెకు విశ్రాంతి దొరుకుతున్నట్లుగా అనిపించేది. పగటిపూట టేకేదార్ దగ్గర 'మాపు' అప్పజెప్పి ఆకు, తంబాకు తెచ్చుకున్నాక మాత్రం పావుగంటో అరగంటో పడుకునేది.

వాడలోని వాళ్ళందరికీ పెద్దదిక్కు అమ్మే. ఏ సమస్యవచ్చినా, ఎంత పెద్ద వాళ్ళయినా అమ్మ దగ్గరకొచ్చి ఆమెతో మాట్లాడి వెళ్ళనిదే ఎవరికీ తృప్తి ఉండేదికాదు.

ఉదయతూర్పావు మసక చీకట్లో రోట్లో బియ్యంపోసి, కుదురుపెట్టి లస్మత్తతోపాటు జోడుగా అమ్మ రోకలితో దంచుతుంటే అలాగే చూడబుద్ధి అయ్యేది. అమ్మ భుజాలలోని శక్తికి వెలుగురేఖ రాకముందే బియ్యమంతా చకినాల పిండి కిందకు మారిపోయేది. అమ్మ చేసే చకినాలు, గారెలు రోజుల తరబడి ఉండిపోయేవి.

చకినాలు, గారెలు, అరిసెలు, బూరెలు, గరిజెలు, కారప్పూస, చేగోడీలు, సర్వపిండి, మక్కగట్క, అనుపగుడాలు, కుడుములు, అట్లు... అమ్మ చేసిన ప్రతీది ప్రత్యేకమైన రుచిని కలిగి ఉండేది.



తినే వస్తువులు ఆత్మీయంగా, ఆప్యాయంగా, శ్రమకోర్చి అందించినవైతే వాటిలోని మాధుర్యం మనసును తాకుతుంది.

పిజ్జాలు, బర్గర్లు, పాప్‌కార్న్, ఆలూచిప్స్, సమోసాలు, కేకులు ఇలా డబ్బు పారేస్తే అలా దొరికేవి... మనసునెలా కదుపుతాయి? వీటన్నింటిని రాసులుగా పోసినా సాయం కాలం ముసురుగా ఉన్న వేళ అమ్మ

అర్ధరాత్రి వరకు టీవి ప్రోగ్రాంలు, బారెడు పొద్దెక్కాక అపార్ట్‌మెంట్ చుట్టూరా లెక్కలేనన్ని వాహనాల చప్పుళ్ళతో అయ్యే మెలకువ... లేవగానే హడావిడి... కనీసం ఒకరినొకరు పలకరించుకోవడానికి వీలులేని హడావిడి... తినీ తిననట్లుగా తిరిగి ఉరుకులు పరుగులతో రోడ్డెక్కడం...

మూకుట్లోంచి వేడివేడిగా తీసి అందించే మిరపకాయబజ్జీ ముందర నిలుస్తాయా?

ముసురు పట్టిన ఆకాశం, పచ్చని పంట పొలాలు, నిరంతరం పారే గోదారి, ఉదయం పూట చలిమంట, పచ్చని చెట్లమీద వాలే పక్షులు, సాయంకాలం పూట వీచే గాలులు, వాన పడేటప్పుడు వేడి చాక్ తాగుతూ చెప్పుకునే కబుర్లు ఎన్నో ఎన్నెన్నో... అన్నింట్లో ఒకటిగా అమ్మ ఉన్నట్లు కనిపించేది. అన్నింట్లో మమేకమైనట్లుగా అమ్మతనం కనిపించేది.

కాని ఇదేంటి... అర్ధరాత్రి వరకు టీవి ప్రోగ్రాంలు, బారెడు పొద్దెక్కాక అపార్ట్‌మెంట్ చుట్టూరా లెక్కలేనన్ని వాహనాల చప్పుళ్ళతో అయ్యే మెలకువ... లేవగానే హడావిడి... కనీసం ఒకరినొకరు పలకరించుకోవడానికి వీలులేని హడావిడి... తినీ తిననట్లుగా తిరిగి ఉరుకులు పరుగులతో రోడ్డెక్కడం... తిరిగితిరిగి అలసిపోయి, పొగ చూరిన ఊపిరితిత్తులతో, దిబ్బళ్ళు పడిన చెవులతో, అలసిపోయిన మెదడుతో... పల్లెలో రైతు అలసట ప్రశాంతతను చేకూర్చి ఆదమరిచి నిద్రించేలా చేస్తుంది. కానీ తీవ్రమైన ఒత్తిడి ఆందోళన వల్ల వచ్చిన ఈ అలసట నిద్రను మింగేస్తుంది. మళ్ళీ ఆల్ప్రా జొలామో, డైజీఫామో కడుపులో పడితేగానీ కునుకురాదు... ఏదీ అమ్మ కనిపించదేం!... అమ్మతనం కాకుండా ఇదేంటి...? గడియారం టిక్‌టిక్‌లు, యంత్రాల రొదలు, వాహనాల చప్పుళ్ళు చిన్న మెదడుపై వేలటన్నుల ఒత్తిడి... గుండెపైన ముళ్ళకిరీటం... గాయాలు... విరిగిపడిన కలల రెక్కలు... లుప్తమైన ఈస్తటిక్ సెన్స్...

** ** **

మళ్ళీ వాసన మొదలయ్యింది. విపరీతమైన ప్లాస్టిక్ వాసన. కడుపులో తిప్పే పచ్చివెగటు వాసన... గొంతులో జుగుప్సను నిలువచేసే కంపు ప్లాస్టిక్ వాసన.

తట్టుకోలేక పోయాను.

తటాలున ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుని చింపి చదివాను.

"చిరంజీవి వెంకటేశంకు,

మీ చిన్నబాపు మల్లేశం రాయునది. మీ అమ్మ ఆరోగ్యం అస్సలు బాగోలేదు. రాగలవు. ఇట్లు మీ చిన్నబాపు మల్లేశం."

ఉదయం ఇంటర్నెట్‌లో చాటింగ్ చేసేప్పుడు

ప్రపంచమంతా పిడికిట్లో ఇమిడిపోయే మౌస్‌లో ఉందనుకున్నాను. కాని ఇదేంటి కేవలం కొన్ని మైళ్ళ దూరంలోనే ఉన్న అమ్మ గురించిన సమాచారం ఇంత ఆలస్యంగా అందిందేం? దూరాల్ని అధిగమించే ప్రయత్నంలో దగ్గిర తనాన్ని కోల్పోతున్నామా?

ప్రపంచాన్నంతా ఆవరించియున్న సాలెగూటి దారాలలో చిక్కిపోయి కొన ఊపిరితో ఉన్న అమ్మతనం... విలవిలలాడుతూ... గిజగిజా గింజుకుంటూ ఊపిరందక అవస్థతో ఎగిరెగిరి పడుతూ...

బడే దినోంకే బాద్ హమ్ బే వతనోంకే యాద్...

వాసన భరింపరానిదిగా తయారైంది. తలలో నొప్పి మెలికలు తిరుగుతూ తలంతా వ్యాపించింది. విపరీతమైన వాసన...

ఇల్లంతా వెతికాను. బీరువాలోంచి పెర్‌ఫ్యూమ్ బాటిల్ తీసి గదినిండా చల్లాను. అగర్‌బత్తీలు తీసి వెలిగించాను. ఫ్రిజ్‌లో ఉన్న మల్లెపూలు తీసి నేలంతా పరిచాను.

ఒక్కో ప్రయత్నం చేస్తున్న కొద్దీ పచ్చి ప్లాస్టిక్ వెగటువాసన మరింత ఎక్కువ కాసాగింది.

బెడ్‌రూంలోకి చూసాను. ప్రశాంతంగా నిద్రిస్తున్న హరిణి కనిపించింది. అలసిపోయిన చందమామలా ఉందామె మొహం.

ప్రాణం లేచొచ్చినట్లయింది.

బెడ్ వద్దకు వెళ్ళి వంగి ఆమెను ముద్దు పెట్టుకున్నాను.

తట్టుకోలేకపోయాను.

ఆమె నుంచి వస్తున్న ప్లాస్టిక్ వాసన ఎంత తీవ్రస్థాయిలో ఉందంటే....

కడుపులో చేయిపెట్టి దేవినట్లయింది.

భళ్ళున వాంతి చేసుకున్నాను.

ఉలికిపడి లేచింది హరిణి.

"ఏంటండీ ఏమయింది?" ఆందోళనగా అడిగింది.

"వాసన... వాసన" కష్టమ్మీద చెప్పాను.

"ఏం వాసన"

"నీకు రావడం లేదా... వాసన... పచ్చి ప్లాస్టిక్ వెగటువాసన"

వెర్రిదాన్లా చూసిందామె.

పెద్దోడు లేచాడు.

"వాట్ డాడీ వాట్ హాపెండ్"

వాడిని దగ్గిరగా తీసుకుని చెప్పాను.

"మా అమ్మకు సీరియస్‌గా ఉందట"

"ఇందులో బాధపడేదేముంది. ముసలోళ్ళకు ఆరోగ్యం బాగా లేకపోవడం... చచ్చిపోవడం కంపల్సరీ అని మా టీచర్ కూడా చెప్పారు" అన్నాడు వాడు.

వాడు మాట్లాడుతూన్నకొద్దీ వాడి నోట్లోంచి గుప్పుగుప్పుమని ప్లాస్టిక్ వాసన నా ముక్కు రంధ్రాలలోంచి వెళ్ళి కడుపులో ప్రేగుల్ని మెలి తిప్పసాగింది.



ప్రపంచమంతా పిడికిట్లో ఇమిడిపోయే మౌస్‌లో ఉందనుకున్నాను. కాని ఇదేంటి కేవలం కొన్ని మైళ్ళ దూరంలోనే ఉన్న అమ్మ గురించిన సమాచారం ఇంత ఆలస్యంగా అందిందేం? దూరాల్ని అధిగమించే ప్రయత్నంలో దగ్గిరతనాన్ని కోల్పోతున్నామా?
ప్రపంచాన్నంతా ఆవరించియున్న సాలెగూటి దారాలలో చిక్కిపోయి కొన ఊపిరితో ఉన్న అమ్మతనం... విలవిలలాడుతూ... గిజగిజా గింజుకుంటూ ఊపిరందక అవస్థతో ఎగిరెగిరి పడుతూ...

ప్లాస్టిక్ కల్చర్, డిస్పోజబుల్ కల్చర్...డిస్పోజబుల్ నీడిల్స్, డిస్పోజబుల్ సిరంజీ, డిస్పోజబుల్ గ్లాసెస్, డిస్పోజబుల్ బాటిల్స్... డిస్పోజబుల్ లైవ్స్... అవసరమున్నంతసేపు వాడుకుని విసిరిపారెయ్....

లేదు... లేదు... అలాకాకూడదు.... అమ్మ చనిపోకూడదు... అమ్మ బతకాలి, అమ్మను బతికించుకోవాలి... అమ్మను నిరంతరం బతికించుకుంటూనే ఉండాలి.... అమ్మతనం తరం నుండి తరానికి ట్రాన్స్‌ఫర్ అవుతూనే ఉండాలి... అమ్మతనపు మనుగడ అంతర్వాహినిలా సృష్టి అంతంవరకూ మనుషుల హృదయాల్లో ప్రవహిస్తూనే ఉండాలి.

వాసన భరించలేకపోయాను.

వాడిని ఒక్కతోపు తోసి బైకు బయటకు తీసాను.

"ఏమండీ ఏమయింది మీకు... ఈ పరిస్థితుల్లో ఎక్కడికెళుతున్నారు..." వెనుక నుండి హరిణి ఆందోళనగా అరుస్తూనే ఉంది.

బండి వేగం పుంజుకుంది.

మెల్లిమెల్లిగా వాసన దూరమవసాగింది. ●

## తెల్లమచ్చలు

అనేక సంవత్సరముల నిరంతర పరిశ్రమ, పరిశోధన తరువాత తెల్లమచ్చల చికిత్సలో విజయమును పొందియున్నాము. మా చికిత్స ఎంతో ప్రభావకరమైనది. త్వరితముగా పని చేయునది, అంటే చికిత్స ప్రారంభించిన వెంటనే మచ్చ యొక్క రంగు మారుటకు మరియు మచ్చలు ఏర్పడుటకు గల శరీర అంతర్గత వికారములు దూరము చేస్తూ మచ్చలను నివారిస్తూ, శాశ్వతముగా సహజ చర్మపు రంగులోనికి మారుస్తుంది. ఇప్పుడు ప్రచారము నిమిత్తము 'మొదట పరీక్షించి చూడండి' అను స్కీమును అనుసరించి 7 రోజుల మందు ఉచితముగా ఇవ్వబడుతున్నది. మొదట మందుల ప్రభావమును పరీక్షించి సంతృప్తులైన తరువాత చికిత్స తీసుకొనగలరు. నిరాశ పొందిన రోగులు, ఇతరుల వద్ద చికిత్స పొందుతున్న రోగులు కూడా ఈ అవకాశమును తప్పక ఉపయోగించుకోగలరు. రోగి యొక్క వయస్సు, మచ్చ గల స్థానము మరియు మచ్చలు ఎన్ని రోజుల నుండి ఉన్నది పూర్తిగా తెలియజేయండి.

## గుప్తరోగములకు ఉచిత మందు

ప్రాచీన ఆయుర్వేద గ్రంథ విజ్ఞానాన్ని మధించి గడిచిన అనేక సంవత్సరముల పరిశోధన తరువాత మాచే తయారుచేయబడిన పరీక్షితమైన మందుల ద్వారా గుప్తరోగముల చికిత్సలో పూర్తి విజయమును పొందియున్నాము. ఈ మందుల ద్వారా స్వప్నదోషము, మూత్రము ద్వారా వీర్యము పోవుట, స్పెరన్‌టోరియా, శీఘ్రస్ఖలనము, నపుంసకత్వము, అంగబలహీనతలు మొదలగునవి పూర్తిగా తగ్గిపోవును. శరీరములో నూతన ఉత్సాహమును అనుభవించగలరు. రతి సామర్థ్యము పెరుగును. పురుష మందులను పరీక్షించి నమ్మకమును పొందగలరని ప్రచారము నిమిత్తము 7 రోజుల మందును ఉచితముగా ఇస్తున్నాము. రోగులు ఫలితమును చూసి, సంతృప్తులైన తరువాత పూర్తి చికిత్స తీసుకొనగలరు. నిరాశ పొందిన రోగులు ఒక్కసారి మందు వాడి చూడండి. రోగి వయస్సు, సమస్యలు పూర్తిగా నిస్సంకోచముగా వ్రాయగలరు. పూర్తి చికిత్స ఒకేసారి తీసుకోవాలని అనుకునేవారు కూడా వ్రాయవచ్చును.

## తెల్లవెంట్రుకలు, వెంట్రుకలు రాలుటను అరికట్టు చికిత్స

ఏ సమయములోనైనా ఏ కారణము వల్లనైనా తల వెంట్రుకలు రాలుట, తెల్లబడుట జరిగినచో చింతించవద్దు. ప్రాచీన ఆయుర్వేద గ్రంథములలోని పరీక్షితమైన నమూనాలు ఆధారముగా తయారుచేయబడిన మందుల ద్వారా తల వెంట్రుకలు రాలుట, తెల్లబడుట పూర్తిగా తగ్గిపోవును. క్రొత్త వెంట్రుకలు నల్లగా, దట్టముగా పెరుగును. మెదడును చల్లగా నుంచును. జ్ఞాపకశక్తిని వృద్ధి చేయును. వయస్సు, తెల్లవెంట్రుకలు లేదా వెంట్రుకలు రాలుట ఎంతకాలము నుంచి ఉన్నది, స్త్రీ లేదా పురుషులా వివరముగా తెలుపగలరు. చికిత్స కొరకు వ్రాయగలరు. ధర రూ. 160/- స్పెషల్ కోర్సు రూ. 260/-.

**GAYA AYURVED BHAVAN (GV-2)**

**P.O. KATRI SARAI (GAYA) 805 105 PHONE : 06112 - 289361**